

మాట్లాడుతున్న డీఆర్డీవో, చీఫ్ నోడల్ ఆఫీసర్ శేషాద్రి

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

- డీఆర్డీవో, చీఫ్ నోడల్ ఆఫీసర్ శేషాద్రి

మందమర్రి రూరల్, అక్టోబర్ 30 : అర్హులైన పౌరులందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఆర్డీవో, చీఫ్ నోడల్ ఆఫీసర్ బీ శేషాద్రి సూచించారు. మందమర్రి మండలం అందుగులపేట గ్రామంలోని సింగరేణి మహిళా జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో, చీఫ్ నోడల్ ఆఫీసర్ శేషాద్రి మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూఈ నెల 31వ తేదీలోగా ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు రాజ్యంగం మనకు కల్పించిన హక్కు అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవచ్చన్నారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల నాటికలు, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ హీరాలాల్, ఇన్‌చార్జి సీహెచ్ రాజేశం, టీం లీడర్ కృష్ణ, ఎం రమేశ్, శనిగారపు రాజేందర్, రాంచందర్ పాల్గొన్నారు.

# సగం-సగం



- చెన్నూర్ నియోజకవర్గంలో సమానంగా స్త్రీ, పురుష ఓటర్లు
- పురుషుల కంటే స్త్రీల ఓట్లు 172 అధికం
- నిర్ణయాత్మకమైన శక్తిగా ఓట్లు..

కోటపల్లి, అక్టోబర్ 20 : చెన్నూర్ నియోజకవర్గంలో స్త్రీ, పురుష ఓటర్లు దాదాపుగా సమానంగా ఉన్నారు. పురుషుల ఓటర్లతో పోలిస్తే మహిళల ఓటర్ల సంఖ్య కేవలం 172 మాత్రమే ఎక్కువగా ఉన్నది. ఈ ఎన్నికల్లో ఇద్దరూ సమానంగానే ప్రభావం చూపనున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో జైపూర్ మండలంలో మినహా అన్ని మండలాల్లో స్త్రీ ఓటర్ల సంఖ్య ఎక్కువగానే ఉన్నది. మొత్తం 1,84,117 ఓటర్లు ఉన్నారు. ఇందులో 91,969 మంది పురుషులు, 92,141 మంది స్త్రీలు, ఏడుగురు ఇతరులు ఉన్నారు. స్త్రీ, పురుషుల మధ్య ఓట్ల తేడా కేవలం 172గా ఉన్నది. ఇక్కడ ఇద్దరూ నిర్ణయాత్మకమైన శక్తిగా మారనున్నారు.

### మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

| మండలం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| చెన్నూర్ | 21,304 | 21,534 | 0 | 42,838 |
| కోటపల్లి | 12,566 | 12,572 | 2 | 25,140 |
| మందమర్రి | 37,669 | 37,755 | 4 | 75,428 |
| జైపూర్ | 14,258 | 13,994 | 1 | 28,253 |
| భీమారం | 6,172 | 6,286 | 0 | 12,458 |
| మొత్తం | 91,969 | 92,141 | 7 | 1,84,117 |

## అవినీతి అంతమే సింగరేణి ధ్యేయం


ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది

- మందమర్రి ఏరియా జీఎం మనోహర్
- మందమర్రిలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభం

మందమర్రి, అక్టోబర్ 30 : అవినీతి అంతమే సింగరేణి ధ్యేయమని మందమర్రి ఏరియా జీఎం ఏ మనోహర్ అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా జీఎం కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో నవంబర్ 5వ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర విజిలెన్స్ కమిషనర్ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ సంస్థలతో పాటు సింగరేణిలో కూడా ఈ సంవత్సరం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సింగరేణిలోని అన్ని విభాగాలు, గనుల్లో ఈ అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. కేంద్ర విజిలెన్స్ కమిషనర్ ఆదేశాల మేరకు 1987లో సింగరణిలో నిఘా విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీఎండీ ఎన్ శ్రీధర్ ఆధ్వర్యంలో వారం పాటు అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నటు తెలిపారు. అవినీతి వ్యతిరేకంగా ఉద్యోగులందరినీ చైతన్యపరిచి, అవినీతి నిర్మూలనలో అందరినీ భాగస్వాములను చేయడమే విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. అనంతరం జీఎం కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఐఈడీ డీజీఎం రాజన్న, ఎస్టేట్ అధికారి కుమారస్వామి, ఎన్విరాన్‌మెంట్ అధికారి ప్రభాకర్, ఐటీ ప్రోగ్రామర్ రవి, డీవైపీఎం ఆసీఫ్, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీహెచ్ వెంకటేశ్వర్లు

## రక్షణతో ఉత్పత్తి సాధించాలి

- రక్షణ పక్షోత్సవాల కమిటీ కన్వీనర్ బీ.హెచ్ వెంకటేశ్వర్లు
- మందమర్రి జీఎం మనోహర్‌తో కలిసి ఆర్కేపీ ఓసీపీ తనిఖీ

రామకృష్ణాపూర్, అక్టోబర్ 30 : ఆర్కేపీ ఓసీపీలో రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని రక్షణ పక్షోత్సవాల కమిటీ కన్వీనర్ బీ.హెచ్ వెంకటేశ్వర్లు ఉద్యోగులకు సూచించారు. 54వ భద్రత పక్షోత్సవాలోల భాగంగా సోమవారం సేఫీ కమిటీ కన్వీనర్, మందమర్రి ఏరియా జీఎం ఏ మనోహర్ ఆర్కేపీ ఓసీపీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సింగరేణిలో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ ఏడాది రికార్డుస్థాయిలో అతి తక్కువ ప్రమాదాలు నమోదయ్యాయని, అందుకు కృషిచేసిన గరువయ్య (సేఫ్టీ జీఎం కార్పొరేట్)కు అభినందనలు తెలిపారు. అనంతరం జీఎం మనోహర్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేసిన రక్షణ పరికరాలు, పనిముట్లను వాడాలని సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనకు కృషిచేయాలన్నారు. ఇంటి నుంచే భద్రత మొదలవ్వాలని తెలిపారు. అనంతరం 53వ వార్షిక భద్రతా వారోత్సవాల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా కమ్యూనికేషన్ సెల్ బైకులు, పని స్థలాల్లో హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలు, నిర్లక్ష్యం చేస్తే జరిగే పరిణామాలను వివరిస్తూ ప్రదర్శించిన లఘునాటిక అందరినీ ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో ఆర్కేపీ ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, సేఫ్టీ కమిటీ సభ్యులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు మద్దతుగా గీత కార్మిక కుటుంబాల తీర్మానం

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 30 : చెన్నూర్ మండలంలోని కిష్టంపేటలోని గీత కార్మికులంతా బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతూ తీర్మానించారని సర్పంచ్ బుర్ర రాకేశ్ గౌడ్ తెలిపారు. గ్రామ పంచాయతీలోని 80 గీత కార్మిక కుటుంబాలు తమ తీర్మాన పత్రానిన సోమవారం చెన్నూర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, విప్ బాల్క సుమన్‌కు అందచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడూతూ.. గతంలో గీత కార్మికులను ఒక్క ప్రభుత్వం కూడా పట్టించుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ గీత కార్మికులను గుర్తించారని తెలిపారు. పన్నులను మాఫీ చేశారన్నారు. అలాగే రైతులతో సమానంగా బీమా కూడా కల్పించినట్లు చెప్పారు. పింఛన్లను అందించిన కేసీఆర్‌కు మూడోసారి సీఎంను చేసేందుకు గౌడ కులస్తులమంతా ఒక్కదాటిపై వచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిష్టంపేట గీత కార్మికులు పాల్గొన్నారు.


చెన్నూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, విప్ సుమన్‌కు తీర్మాన పత్రం అందజేస్తున్న గీత కార్మికులు

## పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించండి

భీమారం, అక్టోబర్ 30 : రాష్ట్రంలో పని చేసే ప్రభుత్వాన్ని, అభివృద్ధి చేసే నాయకులు ఆదరించాలని బీఆర్ఎస్ నాయకులు వేముల శ్రీకాంత్ గౌడ్, వేముల ప్రణీత్ గౌడ్, అనపర్తి దేవాదాస్ ప్రజలను కోరారు. భీమారం మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ విడుదల చేసిన మ్యానిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నో పథకాలు తెచ్చిన ఎకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాల్క సుమన్‌కు ఓటు వేయాలని కోరారు. ఇప్పటికే భీమారం ఎంతో అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్లేశ్, నాయకులు నాగరాజు గౌడ్, వేముల కిరణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు మ్యానిఫెస్టో వివరిస్తున్న నాయకులు